

ఎల్ఐసి వారోత్సవాల్లో రక్తదాన శిబిరం

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్



ఎల్ఐసి 75వ వ్యవస్థాపక వారోత్సవాల్లో భాగంగా పుత్తూరు కార్యాలయంలో తిరుపతి స్విమ్స్ రక్తదాన కేంద్రం ఆధ్వర్యంలో శుక్రవారం శిబిరాన్ని నిర్వహించారు. సిద్దార్థ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు, కెఎన్ఆర్ కళాశాల విద్యార్థులు, శ్రీసాయి కాలేజీ విద్యార్థులు మొత్తం 117 మంది రక్తదానం చేశారు. జోనల్‌స్థాయిలో అగ్రస్థానంగా నిలిచారు. ఈ కార్యక్రమంలో తిరుపతి స్విమ్స్ బ్లడ్‌బ్యాంక్ ఇన్‌ఛార్జి శ్రీధర్,ఎల్ఐసి రిటైర్డ్ ఉద్యోగి వెంకటముని, సిద్దార్థ కాలేజీ అధ్యాపకులు సురేష్, కెఎంఆర్ కాలేజీ అధ్యాపకులు అరవింద్, ఎల్ఐసి యూనియన్ బ్రాంచి అధ్యక్షులు దస్తగిరి, కార్యదర్శి లక్ష్మణ్‌కుమార్ పాల్గొన్నారు.

బడుల విలీనం ఆపండి

పరిశీలిస్తున్నామని కలెక్టర్ హామీ



కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న ప్రజాసంఘాల నాయకులు

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

తిరుపతి జిల్లా తడ, కెవిబిపురం, రామచంద్రాపురం, పుత్తూరు, దొరవారిసత్రం, సూళ్లూరుపేట, గూడూరు, నాయుడుపేట మండలాల్లో పాఠశాలల విలీన ప్రక్రియను తల్లిదండ్రులు, గ్రామస్తులు, విద్యాకమిటీలు తీవ్రంగా వ్యతిరేకిస్తూ ఆందోళనలు చేస్తున్నారని, సమస్యాత్మక పాఠశాలలను కొనసాగించాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు వందవాసి నాగరాజు డిమాండ్‌చేశారు. ఐద్వా జిల్లా కార్యదర్శి సాయిలక్ష్మి, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శిలు అక్బర్, రవి, సిఐటియు నాయకులు జయచంద్ర ఆధ్వర్యంలో కలెక్టర్‌ను కలిసి పాఠశాలల విలీన సమస్యలపై వినతిపత్రం ఇచ్చి చర్చించారు. ఆయా మండలాల్లో గత నాలుగు నెలలుగా 'మా ఊరి బడి మాకే కావాలి' అని పోరాడుతున్నా మండల విద్యాశాఖ అధికారులు తీవ్రతను రిపోర్టు చేయడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారని అన్నారు. కలెక్టర్ స్పందిస్తూ పాఠశాలల విలీనం ఆందోళనలు తీవ్రంగా ఉన్న చోట మినహాయిస్తామని చెప్పారు. హైవే, వాగులుర, వంకలు, చిన్నారులకు ఇబ్బంది కలిగించేలా ఉంటే అటువంటి పాఠశాలలను కొనసాగించేలా చేస్తామని హామీ ఇచ్చారు.

భద్రత లేని బడికి మాకెందుకు

ఏర్పేడు : మండలంలోని అంజిమేడు పంచాయతీ పోతుమానుగుంట ప్రాథమిక పాఠశాల నుంచి 3, 4, 5 తరగతుల విద్యార్థులను అంజిమేడు ప్రాథమిక పాఠశాలలో విలీనం చేయడంతో తల్లిదండ్రులు, గ్రామస్తులు పోతుమానుగుంట ప్రాథమిక పాఠశాల వద్ద శుక్రవారం నిరసన తెలిపారు. పోతుమానుగుంట నుంచి అంజిమేడుకు రెండు కిలోమీటర్ల దూరం ఉందని, రైల్వేగేటు, వైన్‌షాపు, జాతీయ రహదారిని దాటుకుని వెళ్లే పిల్లలకు ఎవరు భద్రతని మండిపడ్డారు. పాఠశాల తెరచి 20 రోజులైనా కలెక్టర్, ప్రజాప్రతినిధులకు వినతిపత్రాలు సమర్పిస్తున్నా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని అన్నారు. ప్రగతి స్వచ్ఛంద సంస్థ ఏర్పేడు మండల కోఆర్డినేటర్ శిరీష, మురగయ్య, గ్రామస్తులు పాల్గొన్నారు. విద్యార్థుల భద్రత దృష్ట్యా పాఠశాల విలీనం వద్దని నినాదాలు చేశారు.

తల్లిదండ్రుల్లో తీవ్ర వ్యతిరేకత

గూడూరు టౌన్‌లో.. తల్లిదండ్రులు తమ పిల్లల మీద ఉన్న శ్రద్ధతో 'మా ఊరు బడి మాకు కావాలి.. బయట గ్రామాలకు మా పిల్లల్ని పంపించలేం' అంటూ రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు చేస్తున్నారని, వారి ఆవేదనను అర్థం చేసుకుని స్కూలు విలీనం ఆపాలని ఎంఇఒ డి.రవీంద్రబాబును సిఐటియు నాయకులు కలిసి వినతిపత్రం సమర్పించారు. భద్రత ఇవ్వగలరా అని డివిజన్ ప్రాంతీయ కార్యదర్శి జోగి శివకుమార్, బివి రమణయ్యలు ప్రశ్నించారు.

అల్లూరి త్యాగం యువతకు స్ఫూర్తి

ప్రజాశక్తి - తిరుపతి సిటి

అల్లూరి త్యాగం యువతకు స్ఫూర్తిదాయకమని వక్తలు ఉద్ఘాటించారు. అల్లూరి సీతారామరాజు 128వ జయంతి సభలు జిల్లావ్యాప్తంగా జరిగాయి. తిరుపతి వేమన విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో భారతీయ విద్యాభవన్, పూలే గురుకుల పాఠశాల, ఎస్‌జిఎస్ హైస్కూల్, వేమన స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్లలో నిర్వహించారు. అల్లూరి వేషధారణలతో చిన్నారుల ఏకపాత్రాభినయం విన్యాసాలు, రూథర్‌ఫర్డ్ - అల్లూరి సంవాదంతో చేసిన నాటిక, తెలుగువీర లేవరా అంటూ పాటకు నృత్యాలు సభికులను ఆకట్టుకున్నాయి. అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. వేమన విజ్ఞాన కేంద్రం ప్రధాన కార్యదర్శి మల్లారపు నాగార్జున మాట్లాడుతూ అల్లూరి స్వాతంత్ర్య సమరయోధుల్లో గొప్ప స్థానం సంపాదించిన వారని, ఆయన ధైర్యం, త్యాగం ప్రతి పౌరునికీ, ప్రత్యేకంగా యువతకు ప్రేరణగా నిలుస్తుందన్నారు. భారతీయ విద్యాభవన్ డైరెక్టర్ సత్యనారాయణరాజు, వేమన విజ్ఞాన కేంద్రం గౌరవ సలహాదారు డాక్టర్ టెంకాయల దామోదరం, అల్లూరి ఆదివాసీల హక్కుల కోసం చేసిన పోరాటాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు చంద్రయ్య, దామోదర్‌గుప్తా, నెల్లూరు మునిలక్ష్మి, బాలాజీ చౌదరి, పంచముఖేశ్వరరావు,జయశంకర్, ఒ.ప్రమోద్, జ్ఞానప్రసూన పాల్గొన్నారు.

- ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యార్థులు నెహ్రూ మున్సిపల్ హైస్కూల్లో నివాళి అర్పించారు. అతి చిన్న వయస్సులో దేశభక్తి నరనరానా పెంచుకున్న గొప్ప నాయకుడు అల్లూరి అని కొనియాడారు. ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు శివ, రవీంద్ర, అజయ్, మార్క్, మారుతీ పాల్గొన్నారు.



వేమన విజ్ఞాన కేంద్రంలో అల్లూరి జయంతి పురస్కరించుకుని విద్యార్థులకు సర్టిఫికెట్లు ప్రదానం

- టిటిడి వెల్ఫేర్ డిపార్టుమెంట్ ఆధ్వర్యంలో128వ జయంతి వేడుకను నిర్వహించారు. మన్యంలో తెల్లదొరల పాలిట సింహస్వప్నం అల్లూరి అని అనంతపురం ఎస్‌కె యూనివర్సిటీ తెలుగు విభాగం ఆచార్యులు ప్రొఫెసర్ జి.బాలసుబ్రమణ్యం అన్నారు. తెల్లదొరల దోపిడీపై అల్లూరి పోరాటం చేసి యోధుడయ్యారన్నారు. టిటిడి ఎస్టేట్ ఆఫీసర్ జి.సువర్ణ మాట్లాడుతూ సాయుధ పోరాటం ద్వారా మన్యం ప్రజల హక్కులకు రక్షణగా ఉంటూ చివరి నిమిషం వరకూ పోరాడారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్వీడబ్ల్యూ డిగ్రీ కళాశాల అధ్యాపకురాలు కష్ణవేణి, డిప్యూటీ ఈవో (వెల్ఫేర్) ఏ. ఆనందరాజు పాల్గొన్నారు.
- రేణిగుంటలో జెవివి ఆధ్వర్యంలో గిరిజన గురుకుల పాఠశాలలో నిర్వహించారు. జెవివి జిల్లా కార్యదర్శి రెడ్డెప్ప, మండల నాయకులు కుప్పస్వామి, హరిబాబు, నారాయణరెడ్డి, బిర్లానాయుడు, ఒ.వెంకటరమణ, శ్యామల, ఉమామహేశ్వరి, ఇమామ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు బహుమతి ప్రదానం చేశారు.
- మేక్‌మై బేబీ జీనియస్ పాఠశాలలో తిరుపతికి చెందిన క్షత్రియ సోదరుల ఆధ్వర్యంలో నిర్వహించారు. రుక్మాంగదరాజు, నవీన్‌రాజు, గిరిరాజు తదితరులు పాల్గొన్నారు.

- పుత్తూరు టౌన్‌లో.. అల్లూరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అల్లూరి భరతమాత ముద్దుబిడ్డ అని డాక్టర్ రవిరాజు కొనియాడారు.

ఎక్కడబడితే అక్కడ చెత్తవేస్తే జరిమానా : కమిషనర్


ప్రజాశక్తి - తిరుపతి టౌన్

నగరంలో ఎక్కడబడితే అక్కడ చెత్త వేస్తే వారిని గుర్తించి జరిమానా విధించాలని, మరోసారి చెత్త వేయకుండా చూడాలని కమిషనర్ ఎన్.మౌర్య అధికారులను ఆదేశించారు. శుక్రవారం నగరలోని మూడో వార్డులో పలు ప్రాంతాల్లో పారిశుధ్య పనులను పరిశీలించారు. చెత్తకుప్పలు ఉండటాన్ని చూసి ఆగ్రహం వ్యక్తం చేశారు. తెల్లవారుజామున, రాత్రుల్లో కవర్లలో చెత్త వేస్తున్నారని సిబ్బంది కమిషనర్‌కు తెలిపారు. కమిషనర్ వెంట హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, డిఇలు లలిత, శిల్ప, ఎసిపి బాలాజీ, సర్వేయర్ కోటేశ్వరరావు, శానిటరీ సూపర్‌వైజర్ సుమతి ఉన్నారు.

తుడా చైర్మన్‌ను కలిసిన డాక్టర్ శైలజ

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

తిరుపతి జిల్లా అదనపు వైద్యాధికారిగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన డాక్టర్ శైలజ శుక్రవారం తుడా చైర్మన్ డాలర్స్ దివాకర్ రెడ్డి ని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆమె విద్యార్థులకు అవసరమైన నోటు పుస్తకాలు, పెన్నులు, స్టేషనరీ అందించి శుభాకాంక్షలు తెలియజేశారు. జిల్లాలో టీబి నిర్మూలనలో భాగస్వామ్యం కావాలని డాక్టర్ శైలజ తుడా చైర్మన్‌ను కోరారు. టీబీ సోకిన వారికి పౌష్టికాహారం, నెలసరి మందులను ఉచితంగా అందించడానికి తాను సిద్ధంగా ఉన్నానని తుడా చైర్మన్ డాలర్స్ దివాకర్ రెడ్డి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టీబి నిర్మూలన సూపర్వైజర్స్ మురళి, లోకేష్, మొహిద్దిన్ తదితరులు పాల్గొన్నారు.



స్విమ్స్‌లో సిఐటియు ఆధ్వర్యంలో కొనసాగుతున్న రిలేదీక్షలు

యథావిధిగా స్విమ్స్ కార్మికుల రిలే దీక్ష

ప్రజాశక్తి - తిరుపతి సిటి

స్విమ్స్ కాంట్రాక్టు కార్మికులు చేపట్టిన రిలే నిరాహారదీక్ష శుక్రవారానికి తొమ్మిదోరోజుకు చేరుకుంది. కార్మికులు ఉదయం డ్యూటీకి వెళ్లే ముందు గంటసేపు దీక్షా శిబిరంలో కూర్చుని తమ నిరసన తెలియజేస్తున్నారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి, యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ వేణుగోపాల్, సిఐటియు నగర ప్రధాన కార్యదర్శి మాధవ్, హాకర్స్ కార్యదర్శి పి.బుజ్జి మాట్లాడుతూ సమస్య పరిష్కారం అయ్యేంత వరకూ తమ నిరసన కొనసాగుతుందని హెచ్చరించారు. స్విమ్స్ డైరెక్టర్, టిటిడి అధికారులు తీసుకున్న ద్రోహపూరితమైన వైఖరికి నిరసనగా ఒక్కరోజు సమ్మె చేశామని,ఒక్కరోజుకే స్విమ్స్ అతలాకుతలం అయ్యిందన్నారు. పేషంట్లను తీసుకెళ్లేవారు లేక, ఆపరేషన్‌కు సదుపాయాలు చేసేవారు లేక, బాత్రూమ్‌లు కడిగేవారు లేక సమస్యల మయం అయ్యిందన్నారు. ఇతర విభాగాల్లో పనిచేసేవారు ఈ పనులన్నీ చేయాల్సి వచ్చిందన్నారు. గురువారం దాదాపు నాలుగు గంటలపైన జరిగిన చర్చల్లో కలెక్టర్ ప్రతినిధిగా ఆర్డీవో రామ్మోహన్, ఎస్పీ ప్రతినిధిగా ఎఎస్‌పి రవి మనోహర్ ఆచారి, వెస్ట్ సిఐలు రంగంలోకి దిగి కార్మికుల పోరాటం చట్టబద్ధమైనదని అంగీకరించి, త్వరలోనే సమస్య పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో సమ్మె విరమించి, రిలేదీక్షలు కొనసాగిస్తున్నామని చెప్పారు. రోగుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని సమ్మెను విరమించామన్నారు. ఈ కార్యక్రమంలో స్విమ్స్ యూనియన్ నాయకులు జి.రవి, వి సూరి, మారి ముత్తు, గోపి, వెంకటేష్, జనార్దన్, జయమ్మ, వెంకటేష్, కోటయ్య, మునికష్ణ, మునేంద్ర, రత్నవేలు తదితరులు పాల్గొన్నారు.



తిరుపతిలో 'టాటా స్కిల్' సంస్థ ఏర్పాటుకు వినతి

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

తిరుపతి అభివృద్ధికి టాటా స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్, బిపిఒ ఏర్పాటు చేయాలని టాటా సన్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఛైర్మన్ ఎన్.చంద్రశేఖరన్‌ను తిరుపతి ఎంపి మద్దిల గురుమూర్తి శుక్రవారం ముంబాయిలో మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం సమర్పించారు. ఐజర్, ఐఐటి, విశ్వ విద్యాలయాలు, ఇంజినీరింగ్ కాలేజీలతో వేగంగా అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు. ఈ ప్రాంత యువతకు అత్యాధునిక రంగాలైన డిజిటల్ టెక్నాలజీ, గ్రీన్ ఎనర్జీ, మాన్యుఫ్యాక్చరింగ్, సేవా రంగాలలో శిక్షణ కల్పించేలా టాటా స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ అవసరమని తెలిపారు. అలాగే బిపిఒ కేంద్రం ద్వారా యువతకు ఉపాధి అవకాశాలు కల్పించవచ్చని పేర్కొన్నారు. అలాగే తిరుపతి నుంచి నేరుగా అంతర్జాతీయ విమాన సర్వీసులు కువైట్, కతార్, సౌదీ అరేబియా, యుఎఇలకు నేరుగా ప్రారంభించాలని కోరారు.

9న సార్వత్రిక సమ్మెను జయప్రదం చేద్దాం

ప్రజాశక్తి - శ్రీకాళహస్తి, యంత్రాంగం

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక, కర్షక, ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా జులై 9వ తేదీన జరగనున్న సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా నాయకులు ప్రసాదరావు పిలుపునిచ్చారు. సమ్మె ఆవశ్యకతను నాయకులకు వివరించారు. అన్ని వర్గాల కార్మికులు సమ్మెలో పాల్గొనేలా సమాయత్తం చేయాలని సూచించారు. నాలుగు లేబర్ కోడ్ల రద్దు కోసం ఉద్యమించకుంటే కార్మికుల భవిష్యత్తు అంధకారమేనని హెచ్చరించారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు అంగేరి పుల్లయ్య, జిల్లా కార్యదర్శి పెనగడం గురవయ్య, గంధం మణి, వెంకటేష్, వేణు, రేవతి, తదితరులు పాల్గొన్నారు.

- వెంకటగిరి మండలం సోమసానిగుంట పంచాయతీ పరిధిలో ఎగువ అరవపాలెం, పరాటపాలెంలో ప్రతి ఇంటికీ తిరిగి జులై 9న జరగన్ను సార్వత్రిక సమ్మె ప్రాధాన్యతను వివరిస్తూ కరపత్రాలను సిఐటియు బృందం పంపిణీ చేసింది. సిఐటియు మండల అధ్యక్షురాలు మంజుల పాల్గొన్నారు.



- కెవిబిపురం మండలంలో ఉపాధి కూలీలకు వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దాసరి జనార్ధన్ ఆధ్వర్యంలో సార్వత్రిక సమ్మె విశిష్టతను వివరించారు. ఏడాదికి 200 రోజులు పనిదినాలను కల్పిస్తూ, 600 రూపాయలు రోజు వేతనం అందేలా బడ్జెట్ రూపకల్పన చేయాలని డిమాండ్‌చేశారు.
- ఏర్పేడులో రైతుసంఘం అధ్యక్షులు రంగయ్య, సిఐటియు నాయకులు కరీముల్లా, సిపిఎం నాయకులు వెంకటాద్రి ఆధ్వర్యంలో కరపత్రాలతో ప్రచారం చేశారు. సమానపనికి సమాన వేతనం అందజేయాలనే దృక్పథంలో దేశవ్యాప్తంగా రైతు కార్మిక సంఘం ఆధ్వర్యంలో సార్వత్రిక సమ్మె చేస్తున్నట్లు వివరించారు.

12 అర్ధరాత్రి నుంచి మున్సిపల్ ఇంజినీరింగ్ పారిశుధ్య కార్మికుల సమ్మె

ప్రజాశక్తి - వెంకటగిరి టౌన్



ఈనెల 12 అర్ధరాత్రి నుంచి మున్సిపల్ ఇంజినీరింగ్ పారిశుధ్య కార్మికులు సమ్మెలోకి వెళ్లనున్నట్లు ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ (సిఐటియు) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ఉమా మహేశ్వరరావు వెల్లడించారు. విజయవాడలో జరిగిన మున్సిపల్ ధర్నాలో ఈ మేరకు నిర్ణయించినట్లు చెప్పారు. మహాధర్నాకు తిరుపతి జిల్లా నుంచి 25 మంది మున్సిపల్ పారిశుధ్య, ఇంజినీరింగ్ కార్మికులు హాజరయ్యారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా అధ్యక్షులు వడ్డిపల్లి చెంగయ్య మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా చేపట్టనున్న సమ్మెను తిరుపతి జిల్లాలోని అన్ని మున్సిపాలిటీల్లోనూ జయప్రదం చేయాలన్నారు. అన్ని మున్సిపాలిటీల వద్ద శిబిరాలు ఏర్పాటు చేసుకుని రోజువారీ నిరసనలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు కోటేశ్వరరావు , పెంచలయ్య, సుబ్రహ్మణ్యం, రమణయ్య ,తదితరులు పాల్గొన్నారు.

వంగవీటి రంగా జయంతికి అన్నదానం

ప్రజాశక్తి - తిరుపతి సిటి

వంగవీటిరంగా 78వ జయంతి పురస్కరించుకుని అనంతవీధి సర్కిల్లో అన్నదానం చేశారు. రంగా చిత్రపటానికి ఎంఎల్‌ఎ ఆరణి శ్రీనివాసులు పూలమాల వేసి నివాళి అర్పించారు. కేక్ కట్ చేశారు. రంగా ఆశయాలను సాధించడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర హస్తకళల అభివృద్ధి సంస్థ ఛైర్మన్ డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్, ఎపి అర్బన్ డెవలప్‌మెంట్ ఫైనాన్స్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ డైరెక్టర్ వూకా విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

గిట్టుబాటు లేక రైతుల ఆత్మహత్యలు : భూమన

ప్రజాశక్తి -తిరుపతి సిటి

గిట్టుబాటు ధర లేక, సరైన ధర చెల్లించక ఆంధ్రా రాష్ట్రంలో ముఖ్యంగా చిత్తూరు జిల్లాలో రైతులు ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితి దాపురించిందని వైఎస్ఆర్‌సిపి చిత్తూరు ఉమ్మడి జిల్లా అధ్యక్షులు భూమన కరుణాకరరెడ్డి విమర్శించారు. పద్మావతి పురంలోని ఆయన నివాసంలో కరుణాకర్ రెడ్డి శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ టీడీపీ మద్దతు లేకపోతే కేంద్రంలో ప్రభుత్వం నిలబడే పరిస్థితి లేదన్నారు. అయినా రాష్ట్రం కోసం చేసింది ఏమీ లేదన్నారు. కుప్పం పర్యటనకు విచ్చేసిన చంద్రబాబునాయుడు మామిడి రైతుల కష్టాలు తీర్చే ఆలోచన చేయకపోగా తమపై దాడి చేయడానికి సమయం వెచ్చించారన్నారు. కేంద్ర మంత్రి కుమార స్వామి అభ్యర్థనతో కర్ణాటక రాష్ట్రంలో 2లక్షల 50వేల టన్నులు కిలో 16 రూపాయలు కొనుగోలు చేయడానికి కేంద్రం అంగీకరించిందని, చంద్రబాబు, పవన్ కల్యాణ్ కేంద్రాన్ని అభ్యర్థించింది లేదన్నారు. మన రాష్ట్రం కంటే కర్ణాటక రాష్ట్రం లో మామిడి పంట తక్కువ అయినా, వాళ్లు కనీస మద్దతు ధర దక్కించుకున్నారని గుర్తు చేశారు. మామిడి ఫ్యాక్టరీ యాజమాన్యంతో మంతనాలు చేయడం తప్ప, ప్రకటించిన మద్దతు ధరలో ఒక్క రూపాయి కూడా రైతులకు రాలేదన్నారు. ఈనెల 9న బంగారుపాళ్యంలో మామిడి రైతుల కష్టాలు వినడానికి వైసిపి అధినేత జగన్మోహన్‌రెడ్డి విచ్చేస్తున్నారని తెలిపారు. విలేకరుల సమావేశంలో మేయర్ డాక్టర్ శిరీష, నాయకులు రాజేంద్ర పాల్గొన్నారు.

ప్రపంచ విజేతలను అభినందించిన టిటిడి చైర్మన్

ప్రజాశక్తి -తిరుమల

అమెరికాలోని బర్మింగ్‌హామ్ నగరంలో జరిగిన ప్రపంచ పోలీస్, ఫైర్ గేమ్స్ - 2025 పోటీల్లో టీటీడీ సెక్యూరిటీ విజిలెన్స్ విభాగానికి చెందిన ఇద్దరు అధికారులు అరుదైన క్రీడా ప్రతిభను ప్రదర్శిస్తూ అద్భుత విజయాలు సాధించి జాతీయ మువ్వెన్నల పతాకాన్ని రెపరెపలాడించారు. 45 సంవత్సరాలు పైబడిన విభాగం సింగిల్స్ టెన్నిస్ పోటీలో టీటీడీ విజీఓ ఎ.సురేంద్ర స్వర్ణ పతకాన్ని గెలుచుకోగా, 55 సంవత్సరాల పైబడిన విభాగం సింగిల్స్ టెన్నిస్ పోటీలో వీజీవో ఎస్టీవీ రామ్ కుమార్ కాంస్య పతకాన్ని సాధించారు. ఈ సందర్భంగా టీటీడీ చైర్మన్ బీ.ఆర్.నాయుడు, టీటీడీ ఈవో జె.శ్యామలరావు విజేతలను అభినందించారు. ప్రపంచవ్యాప్తంగా 80 దేశాల పోలీస్, ఫైర్ విభాగాల నుంచి 9వేల మంది అథ్లెట్లు పాల్గొన్న ఈ ద్వైవార్షిక పోటీల్లో టీటీడీ అధికారుల విజయాలు దేశానికే గర్వకారణమని, టీటీడీకి ఇది ఒక గొప్ప గౌరవంగా నిలిచిందని కొనియాడారు. అదనపు ఈవో సి.హెచ్. వెంకయ్య చౌదరి, జేఈవో వీ.వీరబ్రహ్మం, సీవీఎస్వో మురళీకష్ణలు కూడా విజేతలకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ జాతీయ స్థాయి విజయం టీటీడీ సెక్యూరిటీ, విజిలెన్స్ విభాగం లోని అధికారుల నైపుణ్యాన్ని, నిబద్ధతను చాటిందని, ప్రపంచవ్యాప్తంగా టీటీడీ ప్రతిష్టను మరింత పెంచేలా ఈ విజయం తోడ్పడిందని పేర్కొన్నారు.

రేపే ఎస్వీయూలో జాబ్ మేళా

ప్రజాశక్తి - క్యాంపస్

శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలోని స్టూడెంట్స్ వెల్ఫేర్, కల్చరల్ అఫైర్స్ విభాగం ఆధ్వర్యంలో 6న ఆదివారం ఎంఆర్‌ఎఫ్ సంస్థ నిర్వహిస్తోందని డైరెక్టర్ ఆచార్య మురళీధర్, కోఆర్డినేటర్ పత్తిపాటి వివేక్ తెలిపారు. డిగ్రీ చదివిన విద్యార్థులు ఇంటర్వ్యూకు హాజరుకావాలన్నారు.

ఈఎస్ఐ ఆస్పత్రిలో తనిఖీలు



ప్రజాశక్తి - తిరుపతి సిటి: తిరుపతిలోని కార్మిక రాజ్య బీమా ఆస్పత్రిలో రాష్ట్ర బీమా వైద్యసేవల శాఖ డైరెక్టర్ వి.ఆంజనేయులు శుక్రవారం తనిఖీ చేశారు. ఆస్పత్రిలోని ఔట్‌పేషంట్ బ్లాక్, ఫార్మసీ, ఇన్‌పేషంట్ల వార్డులను విభాగాల వారీగా తనిఖీ చేసి, రోగులకు అందుతున్న వైద్యసేవలను రోగులను అడిగి తెలుసుకున్నారు. వైద్యం విషయాలను మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎం.శ్యాంబాబు ద్వారా అడిగి తెలుసుకున్నారు. అనంతరం డైరెక్టర్ వి.ఆంజనేయులు మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని ఇఎస్ఐ ఆస్పత్రులకు అవసరమైన సర్జికల్, ల్యాబ్ ఐటమ్స్ వంటి వాటిని దాదాపు 11 కోట్ల రూపాయలతో సమకూర్చుకునేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఆస్పత్రి సిబ్బంది తక్కువగా ఉన్నా గత కొని నెలలుగా ఔట్‌పేషంట్లు, ఇన్‌పేషంట్ల సంఖ్యను పెంచేందుకు కృషిచేసిన సూపరింటెండెంట్‌ను అభినందించారు. ముందుముందు వంద పడకల స్థాయికి తగినట్లుగా సమకూర్చాలని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా జీతాల పెంపు, ఉద్యోగ భద్రత విషయమై హౌస్‌కీపింగ్, సెక్యూరిటీ సిబ్బంది విన్నవించుకున్నారు. ఈ సమావేశంలో ఆర్ఎంఒ డాక్టర్ ఎవిఎస్ ప్రసాద్ పాల్గొన్నారు.

ప్రభుత్వ భూముల కబ్జాపై చర్యలేవి : సిపిఎం

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

ప్రభుత్వ భూములను కబ్జా చేస్తున్న, ఎర్రమట్టి తొలిచి అమ్ముతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ వెంకటేశ్వర్‌కు సిపిఎం జిల్లా కార్యదర్శి వి.నాగరాజు వినతిపత్రం సమర్పించారు. చంద్రగిరి నియోజకవర్గం రామచంద్రాపురం మండలంలో సర్వే నంబర్ 28లో కోట్ల విలువ చేసే ఐదు ఎకరాల భూమిని ఆక్రమించుకుని ప్లాట్లు వేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కొండను తొలిచి మట్టి తోలి ఇటుక బట్టీలకు, వెంచర్లకు అమ్ముకుంటున్నారని అన్నారు. కొండను చదును చేసి మామిడిచెట్లు పెట్టుకుని ఫెన్సింగ్ వేశారన్నారు. ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలన్నారు. కొండలు తొలవడం వల్ల పర్యావరణానికి ముప్పు వస్తుందన్నారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో ఎస్.జయచంద్ర, పి.సాయిలక్ష్మి, కె.సుమన్ పాల్గొన్నారు.

వాట్సాప్‌లో బాలుడిని అమ్మకానికి పెట్టిన ట్రస్ట్ అధ్యక్షుడు



బాలుడు



ట్రస్ట్ నిర్వహకుడు మణికంఠ

ప్రజాశక్తి - రామచంద్రపురం (చంద్రగిరి) చంద్రగిరిలోని ఓ ట్రస్ట్ అధ్యక్షుడు బాలుడిని వాట్సాప్‌లో అమ్మకానికి పెట్టిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బాలుడి కోసం డబ్బులు చెల్లించిన బాధితులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. నియోజకవర్గ కేంద్రమైన చంద్రగిరి పట్టణంలో నిర్వహిస్తున్న పట్టెడన్నం అనే స్వచ్ఛంద సంస్థ నిర్వాహకుడు మణికంఠ వాట్సాప్‌లో ఓ బాలుడిని విక్రయానికి పెట్టాడు. రెండేళ్ల బాలుడిని తల్లిదండ్రులకు తెలియకుండా విక్రయించడానికి వాట్సప్‌లో ఫోటోలు పంపి బేరం పెట్టాడు. తిరుపతికి చెందిన పిల్లలు లేని దంపతులకు వాట్సాప్‌లో బాలుడి ఫోటోలు పంపి రూ.60 వేలకు బేరం కుదిర్చుకున్నారు.ఈ మేరకు డబ్బులు కూడా చెల్లించారు.ఎంతకీ పిల్లాడిని తెచ్చి ఇవ్వకపోవడంతో దంపతులు అప్రమత్తమయ్యారు. అమ్మకానికి పెట్టిన వ్యక్తి అడ్రస్ తెలుసుకుని చంద్రగిరికి వచ్చారు. చంద్రగిరి రాముల వారి గుడి వీధిలో ఆటలాడుకుంటూ ఉండిన చిన్న బిడ్డను చూశారు. బాలుడి తల్లిదండ్రులకు సమాచారం అందించారు. అప్రమత్తమైన బాలుడి తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు ట్రస్టు నిర్వాహకుడైన మణికంఠను పోలీస్ స్టేషన్‌కు పిలిపించారు. అతని వాట్సాప్‌లో బాలుడితో పాటు మరికొందరు పిల్లల ఫోటోలు కూడా ఉన్నట్లు గుర్తించారు. పోలీసులు ఈ ఘటన పై పూర్తి వివరాలను సేకరిస్తున్నారు.

'శ్రీసిటీ'లో 'సిక్కీ' బృందం



ప్రజాశక్తి - వరదయ్యపాలెం : చెన్నైలోని దక్షిణ భారత వాణిజ్య , పరిశ్రమల మండలికి చెందిన 22 మంది ప్రతినిధుల బందం శుక్రవారం శ్రీసిటీని సందర్శించింది. శ్రీసిటీ పారిశ్రామిక కార్యకలాపాలు, ఇక్కడ అనుసరిస్తున్న ఉత్తమ పద్ధతుల అధ్యయనం , పెట్టుబడి అవకాశాల పరిశీలన దిశగా వీరి పర్యటన సాగింది.శ్రీసిటీ అసిస్టెంట్ వైస్ ప్రెసిడెంట్ (బిసినెస్ డెవలప్మెంట్) బోడ్గన్ జార్జ్ బంద సభ్యులకు సాదర స్వాగతం పలికారు. చర్చల సందర్భంగా శ్రీసిటీ అత్యుత్తమ మౌలిక సదుపాయాలు, వ్యూహాత్మక స్థానం, వ్యాపారానుకూల పర్యావరణ వ్యవస్థకు సంబంధించి వారికి ప్రదర్శన ఇచ్చారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రగతిశీల పారిశ్రామిక విధానాలు, వేగవంత వ్యాపారం (స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్) గురించి వివరించారు. 31 దేశాలకు చెందిన 235 కి పైగా పరిశ్రమలకు నెలవైన శ్రీసిటీలో విస్తత వ్యాపార అవకాశాలు ఉన్నాయని, వాటిని పరిశీలించి పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు రావాలని వారిని కోరారు.

ఒలంపియాడ్‌లో నైనిత ప్రతిభ



ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: ఫిబ్రవరిలో జరిగిన ఎస్‌.ఓ.ఎఫ్ ఇంటర్నేషనల్ మ్యాథ్స్ ఒలంపియాడ్ పోటీల్లో స్థానిక ఎంజిఎం పాఠశాలకు చెందిన నైనిత(6వ తరగతి) సత్తా చాటింది. ఇంటర్నేషనల్ స్థాయిలో 13424 ర్యాంకు, రాష్ట్ర స్థాయిలో 625 ర్యాంకు సాధించి పాఠశాలకు పేరు తీసుకొచ్చింది. ఈ సందర్భంగా నైనితను ఎంజీఎం గ్రూప్ మేనేజింగ్ డైరెక్టర్ గుడ్డూరు మయూర్ శుక్రవారం అభినందించారు. ఎంజీఎం విద్యాసంస్థల్లో విద్యార్థులను పోటీ పరీక్షల్లో రాణించేలా డిజిటల్ బోర్డులపై బోధన చేస్తున్నామని చెప్పారు. ప్రధానోపాధ్యాయులు మునిరత్నం నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఇండస్ట్రియల్ భూముల పర్యవేక్షణ

ప్రజాశక్తి - వాకాడు: మండల పరిధిలోని తూపిలి పాలెం సముద్ర తీరం వద్ద నౌకల మరమ్మతుల కేంద్రం ఏర్పాటు చేయనున్న నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ ఇండస్ట్రియల్ ఎండి యువరాజు ఇప్పటికే సేకరించిన భూములను శుక్రవారం పరిశీలించారు. భూములకు సంబంధించిన మ్యాపును అధ్యయనం చేశారు. అక్కడ స్థితిగతులను బిజెపి గూడూరు నియోజకవర్గ కన్వీనర్, ఆ ప్రాంతవాసి పాపా రెడ్డి పురుషోత్తం రెడ్డి ఆయనకు వివరించారు. రైతుల యొక్క స్థితిగతులను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో తిరుపతి జాయింట్ కలెక్టర్ శుభం భన్సల్, గూడూరు సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీనా, తాసిల్దార్ రామయ్య, రెవెన్యూ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - గూడూరు టౌన్: ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు కోరారు. శుక్రవారం గూడూరు ఆర్టీసీ డిపో వద్ద ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ 1/19 సర్క్యులర్‌ను అమలు చేయాలని, ఉద్యోగులకు ప్రమోషన్లు ఇవ్వాలని, ఆర్టీసీలో ఖాళీలను భర్తీ చాయాలని, మహిళలకు అవసరమైనన్ని సెలవులు ఇవ్వాలని, పాత పద్ధతిలోనే వైద్య సదుపాయాన్ని కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ సుబ్రమణ్యం, డిపో అధ్యక్షులు నారాయణ తదితరులు పాల్గొన్నారు.

గత ప్రభుత్వం ఇచ్చిన ఇంటి స్థలాల పరిశీలన

ప్రజాశక్తి - తొట్టంబేడు: గత ప్రభుత్వంలో ఇంటి స్థలాలు లేని పేదలకు పంపిణీ చేసిన ఇళ్ల స్థలాలను శుక్రవారం ఆర్డిఓ భాను ప్రకాష్, తొట్టంబేడు మండల తాసిల్దార్ భారతి పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ జగనన్న ఇంటి స్థలాల పేరుతో రెండో విడతలో 175 భాగాలు సంబంధించిన19 ఎకరాల్లో 1640 మందికి ఇంటి స్థలాలు ఇవ్వడానికి ఈ స్థలాన్ని కేటాయించినట్లు తెలిపారు. కానీ ఈ స్థలం ప్రజలకు నివాసయోగ్యంగా ఉంటుందా లేదా అనే విషయాన్ని పరిశీలిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సర్వేయర్ హరి, ఆర్.ఐ సుజాత, వీఆర్వో దినేష్ కుమార్, రాఘవ, అంజలి పాల్గొన్నారు.

బుద్ధుడి విగ్రహం ధ్వంసం హేయం

ప్రజాశక్తి - క్యాంపస్ : మదనపల్లె మండలం, అంకిశెట్టిపల్లి బుద్ధుని కొండపై ఉన్న గౌతమ బుద్ధుని విగ్రహాన్ని ధ్వంసం చేసి, తల నరికి కళ్ళ దగ్గర పెట్టిన దుర్మార్గులను పట్టుకొని, వారి తలలను తెగనరికే శక్తి తమకు కూడా ఉందని, అయితే చట్టబద్ధమైన పరిష్కారంకోసం పోలీసులపై ఆధార పడ్డామని, పోలీసులు నిర్లక్ష్యం చేస్తే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని, భారతీయ అంబేద్కర్ సేన (బాస్) రాష్ట్ర ఉపాధ్యక్షులు పాలకుంట శ్రీనివాసులు, రాష్ట్ర అధికార ప్రతినిధి మల్లెమొగ్గలు ఉమాపతి హెచ్చరించారు. శుక్రవారం యస్వీయు అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన చేశారు. అంకిశెట్టిపల్లి మాజీ సర్పంచ్ శరత్ రెడ్డిని అతని అనుచరులను, బిజెపి నాయకుడు రాజన్నను, ఆతనికి సన్నిహితంగా ఉండే ఆర్ఎస్ఎస్ వారిని విచారిస్తే దోషులు బయట పడతారన్నారు. సీఎం తక్షణమే స్పందించి, పోలీసులకు కఠిన ఆదేశాలు ఇవ్వాలని, లేనిపక్షంలో ఛలో అమరావతి పేరుతో నిరసనకు పిలుపినిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బాస్ రాష్ట్ర కార్యదర్శి మల్లారపు వాసు, ఎస్వీ యూనివర్సిటీ విద్యార్థి విభాగం అధ్యక్షులు ప్రేమ్ కుమార్, ఉమ్మడి చిత్తూరు జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు తలారి రాజేంద్ర, బాస్ నాయకులు పాలకుంట చొప్పు, జాద ప్రకాష్, ముని, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

9న సెలవు ప్రకటించండి

ప్రజాశక్తి - నాయుడుపేట రూరల్: నాయుడుపేట, మేనకూరు సెజ్‌లో పరిశ్రమల యాజమాన్యాలు జూలై 9 దేశవ్యాప్త సమ్మె నేపథ్యంలో కార్మికులకు సెలవు ప్రకటించాలని సిఐటియు నాయకులు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా జ్యోతి పరిశ్రమలో పనిచేస్తున్న కార్మికులను కలిసి వారి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు శివకవి ముకుంద మాట్లాడుతూ జ్యోతి పరిశ్రమ యాజమాన్యం కార్మికుల పట్ల నిర్లక్ష్యం వ్యవహరిస్తుంటే ప్రభుత్వ అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. కార్మికులకు పిఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలు లేవని, పని చేసే చోట సంరక్షణ చర్యలు తీసుకోలేదని తెలిపారు. యాజమాన్యం తీరు మార్చుకోకుంటే సిఐటియు ఆధ్వర్యంలో పోరాటాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు అబ్బల్లా, జై చంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



ప్రజాశక్తి - పుత్తూరు టౌన్: ఏపీఎస్ ఆర్టీసీ కార్మికులు ఎదుర్కొంటున్న అనేక సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ, రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు పుత్తూరు ఆర్టీసీ డిపోలో శుక్రవారం ఏపీపీటీడీ గేట్ మీటింగ్ నిర్వహించారు. డిపో కార్యదర్శి ప్రతాప్ కుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఉద్యోగులు ఎర్ర బ్యాడ్జిలు ధరించి నిరసన తెలిపారు. గ్యారేజ్, డిపో నాయకులు, జిల్లా స్థాయి యూనియన్ ప్రతినిధులు ఈ మీటింగ్‌లో పాల్గొని సమస్యలపై ప్రసంగించారు. ప్రభుత్వం తక్షణమే ఉద్యోగుల అభ్యర్థనలపై స్పందించాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు చలపతి, శ్రీనివాసులు, జై చంద్ర ,మురళి, వేణు, ఆర్టీసీ కార్మికులు పాల్గొన్నారు.

తిరుమల కొండపై మంటలు..
వేగంగా స్పందించటంతో తప్పిన ప్రమాదం



ప్రజాశక్తి - తిరుమల: తిరుమలలో అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. శుక్రవారం జరిగిన ఈ ప్రమాదానికి సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. తిరుమలలోని జి ఎన్ సి దివ్యారామం నర్సరీ దగ్గర అటవీ ప్రాంతంలో మంటలు చెలరేగాయి. ఎండుటాకులు, చెట్లు ఎక్కువగా ఉండటంతో మంటలు వేగంగా వ్యాపించాయి. విషయం తెలుసుకున్న వెంటనే ఘటనాస్థలికి చేరుకున్న అధికారులు ఫైర్ సిబ్బందికి సమాచారం అందించారు. ఘటనాస్థలానికి చేరుకున్న ఫైర్ సిబ్బంది మంటలను అదుపులోకి తెచ్చారు. ఈ ఘటనలో ప్రాణ నష్టం, ఆస్తి నష్టం జరగకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

తహశీల్దారుకు సన్మానం

ప్రజాశక్తి - చిన్నగొట్టిగల్లు: నూతన తహశీల్దారుగా భాగ్యలక్ష్మి బాధ్యతలు చేపట్టిన సందర్భంగా టిడిపి చిన్నగొట్టిగల్లు మండల అధ్యక్షుడు బెల్లంకొండ మురళి, మదనమోహన్, రమణారెడ్డి, మునిస్వామి నాయుడు, కూటమి నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు.

దళిత మహిళ ఇల్లు కూల్చిన రెవెన్యూ సిబ్బంది

బాధితురాలికి న్యాయం చేయాలి : సిపిఎం



డిప్యూటీ తాసిల్దార్‌కు వినతి పత్రం

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్: రూరల్ మండలం, పరమేశ్వర మంగళం పంచాయతీ, మెట్టి గుంట సత్రం, సర్వే నంబర్ 1లో ఒక దళిత మహిళకు రెండు సెంట్లు ఇంటి పట్టా 1996లో ఇవ్వడం జరిగింది. 30 సంవత్సరాలుగా ఆ స్థలంలో ఇల్లు కట్టుకుని, కరెంట్ బిల్లులు, ఇంటి పన్నులు కట్టుకుంటూ దళిత మహిళ కాపురం ఉన్నటువంటి ఇంటిని రెవెన్యూ సిబ్బంది జెసిబితో కూల్చి చదును చేశారు. బాధితురాలికి మద్దతుగా సిపిఎం నాయకులు శుక్రవారం పుత్తూరు తాసిల్దార్ ఆఫీస్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం కార్యదర్శి వెంకటేష్, దళిత గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి సందయ్యలు మాట్లాడుతూ బాధితురాలు తన భర్తకు ఆరోగ్యం సరిగా లేక సిమ్స్‌లో చికిత్స తీసుకుంటున్నందున తిరుపతికి వచ్చి ఉన్నప్పుడు, కనీసం నోటీసు ఇవ్వకుండా ఇంటిని కూల్చేశారని ఆరోపించారు. బాధితురాలికి నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. హైవే రోడ్డు పై భవనాలు, దాబాలు కట్టుకున్న వారిని వదిలేసి పేదలపై దౌర్జన్యం చేయడం దారుణమన్నారు. తక్షణమే బాధితురాలికి న్యాయం చేయాలని లేని పక్షంలో వామపక్ష పార్టీలు, దళిత సంఘాల ఆధ్వర్యంలో ఆందోళన చేస్తామని హెచ్చరించారు. అనంతరం పుత్తూరు డిప్యూటీ తాసిల్దార్ ఆర్‌కె రెడ్డికి వినతి పత్రం సమర్పించారు. ఆయన స్పందించి న్యాయం చేస్తామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ బాలసుబ్రమణ్యం, భారతి, రాజా, యేసు రత్నం తదితరులు పాల్గొన్నారు.

జీవో నెంబర్ 77 రద్దు చేయాలి

ప్రజాశక్తి - క్యాంపస్: రాష్ట్రవ్యాప్తంగా డిగ్రీ, ఇంజనీరింగ్, పీజీ చదువుతున్న విద్యార్థులకు పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ వసతి దీవెన డబ్బులు విడుదల చేయాలని, జీవో నెంబర్ 77 రద్దు చేయాలని ఎఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో తిరుపతి, ఎంఆర్ పల్లి సర్కిల్‌లో శుక్రవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జాతీయ కార్యదర్శి కానాల శివారెడ్డి, జిల్లా కార్యదర్శి ప్రవీణ్ కుమార్‌లు మాట్లాడుతూ ఫీజు చెల్లించకపోవడంతో, కోర్స్ పూర్తిచేసుకుని ఉద్యోగం వచ్చినప్పటికీ కళాశాలల యాజమాన్యాలు సర్టిఫికెట్లు ఇవ్వకపోవడంతో యువతకు వచ్చిన ఉద్యోగాలు వెనక్కు వెళ్లిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం స్పందించి 6400 కోట్ల రూపాయల బకాయిలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యపై 11వ తేదీన కలెక్టరేట్ వద్ద ఆందోళన చేపడతామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా విద్యార్థుల సమీకరించి చలో సీఎం కార్యాలయం పిలుపునిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తిరుపతి జిల్లా సహాయ కార్యదర్శులు హరికృష్ణ, మోహన్, నగర్ నాయకులు వినయ్, వేణు, పవన్, వరప్రసాద్, రాజు పాల్గొన్నారు.


ఏకపక్షంగా గ్రామ కమిటీల ఏర్పాటు తగదు



సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

ప్రజాశక్తి -దొరవారిసత్రం : మండల టీడీపీలో ఏక ఛత్రాధిపత్యం కొనసాగుతోందని, సీనియర్ నాయకులు ఎందరో ఉన్నప్పటికీ ఒకే ఒక్కడే నాయకుడు అన్న రీతిలో ఏకపక్షంగా, మండల పార్టీ అధ్యక్షుడిగా కొనసాగడం బిసి, ఎస్సీ సామాజిక వర్గాన్ని గుర్తించకపోవడమేనని మండల బీసీ సంఘ నాయకులు వంక సుధాకర్ యాదవ్ ఖండించారు. ఈ ఏడాది మండల పార్టీ అధ్యక్షుల ఎంపికకు అవసరమైన గ్రామ కమిటీల ఏర్పాటులో ఇటీవల జరిగిన గ్రామ కమిటీలు ఆమోదయోగ్యంగా లేవని దొరవారిసత్రం మండల పార్టీ కార్యాలయంలో బీసీ నాయకుల ఏకాభిప్రాయ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వంక సుధాకర్ మాట్లాడుతూ పార్టీ కన్వీనర్ గ్రామ కమిటీ ఎంపికలు సొంత నిర్ణయాలు తీసుకోవటం ఏమిటని ప్రశ్నించారు. పార్టీలో ఎన్నో ఏళ్లుగా కొనసాగుతున్న సీనియర్ నాయకుడు వంక రాధయ్యను కమిటీలో బిసి వర్గం నుండి తొలగించి, ఆయనకు ఇష్టం వచ్చిన వెంకటయ్యను కమిటీలు చేర్చడం ఏమిటని నిలదీశారు. ఈ పర్యాయం మండల పార్టీ అధ్యక్షునిగా బీసీలకుఒకసారి అవకాశం కల్పించాలని నియోజకవర్గ ఇన్చార్జ్ నెలవల సుబ్రహ్మణ్యంని కోరడం జరిగిందన్నారు. అందరికీ సమన్యాయం జరిగేలా ఆమోదయోగ్యమైన గ్రామ కమిటీల ఎన్నికలు జరగడానికి అవకాశం కల్పించాలని అభిప్రాయాన్ని వెల్లడి చేశారు. ఈ కార్యక్రమంలో ముని రామయ్య యాదవ్, కాటూరు మునీంద్రయ్య యాదవ్, సమాధి సుబ్రహ్మణ్యం యాదవ్, రామయ్య పాల్గొన్నారు.

రేషన్‌కు తప్పని తిప్పలు



ప్రజాశక్తి - కేవిబి పురం: యండియు వాహనాల రద్దుతో, ప్రజలు రేషన్ షాప్‌ల వద్ద గంటల తరబడి క్యూ కట్టడం, సర్వర్లు మొరాయించడం ప్రతి నెలా ఎదురవుతోంది. రోజుల తరబడి రేషన్ షాప్ వద్ద పడిగాపులు కాయ వలసిన పరిస్థితి ఏర్పడింది. కేవీబి పురం మండలంలో 39 పంచాయితీల్లో 38 రేషన్ షాపులు ఉన్నాయి. వీటి పరిధిలో మూడు లక్షల 50 వేలు రేషన్ కార్డులు ఉన్నాయి. ప్రతి నెల ఒకటో తేదీ నుండి 17వ తేదీ మధ్యలో రేషన్ పంపిణీ జరుగుతుండేది. మండలం వ్యాప్తంగా 10 మొబైల్ డిస్పెన్సింగ్ యునిట్స్ వాహనాల ద్వారా ఇళ్ల వద్దకే వెళ్లి రేషన్ జరుగుతూ వచ్చింది. కానీ యండియు వాహనాల రద్దుతో ఒకే షాపు వద్ద వేలి ముద్రలు వేయాల్సి రావడంతో ప్రజలకు అవస్థలు తప్పడం లేదు. పాతపాలెం పంచాయితీకి చెందిన కేసీ కండ్రిగలో సుమారు 20 మంది వృద్ధులు రేషన్ బియ్యంపై ఆధారపడి జీవిస్తున్నారు. ఇంటికి రేషన్ బియ్యం చేరుతాయో లేదోనని షాపుల వద్ద వారు కూడా పడిగాపులు కాస్తున్నారు. ఈ సమస్యపై స్పందించిన సిపిఎం ప్రాంతీయ కార్యదర్శి నాగరాజు మాట్లాడుతూ రేషన్ పంపిణీ ఎండియు వాహనాలు ద్వారానే పంపిణీ చేయడం సౌకర్యవంతం అన్నారు. దుకాణంలో పంపిణీ చేస్తుండటంతో నిరుపేదలు రేషన్ కోసం పనులు వదులుకొని రోజంతా వేసి చూసే పరిస్థితులు ఉన్నాయన్నారు. రేషన్ షాపులో వేసిన బియ్యాన్ని కొన్ని గ్రామాల్లో ప్రజలు సుమారు రెండు మూడు కిలోమీటర్లు మోసుకొని పోవాల్సి వస్తోందని తెలిపారు. లేదంటే ఆటోలో వెళ్లాలంటే బియ్యం ఉచితంగా ఇచ్చినా ఆటో ఛార్జీలు భరించాల్సి వస్తోందన్నారు.

శ్రీసిటీని సందర్శించిన ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ సీఈఓ



ప్రజాశక్తి - సత్యవేడు: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ సీఈఓ డాక్టర్ గెడ్డం శేఖర్ బాబు శుక్రవారం శ్రీసిటీని సందర్శించారు. శ్రీసిటీ వైస్ ప్రెసిడెంట్ (కస్టమర్ రిలేషన్స్) సి.రమేష్ కుమార్ ఆయనకు సాదర స్వాగతం పలికారు. శ్రీసిటీ ఉన్నతాధికారులతో చర్చల అనంతరం ఆయన స్థానిక మొండెలెజ్, లావాజా, బ్లెండ్‌హబ్, టాటా ఫుడ్స్ తదితర ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలను సందర్శించి, ఆయా సంస్థల ప్రతినిధులతో సంభాషించారు.

ఆర్థిక సాయం చేసి మా బాబు ప్రాణాన్ని కాపాడండి



ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): పుట్టుకతోనే తలలో నీరు చేరిపోవడంతో తీవ్ర ఆరోగ్య సమస్యలు వచ్చాయని, రూ.7 లక్షల రూపాయలు ఉంటే గాని మా అబ్బాయిని బ్రతికించుకోలేనని చిత్తూరు జిల్లా, రామసముద్రం మండలం, నరసాపురం గ్రామానికి చెందిన శ్రీనివాసులు ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం తిరుపతి ప్రెస్ క్లబ్ లో విలేకరుల సమావేశంలో కుటుంబ సభ్యులతో కలిసి ఆయన మాట్లాడారు. బాబు పెరుగుతున్న కొద్దీ సమస్య కూడా పెరుగుతూ వస్తోందని, వీలైనంత త్వరగా ఆపరేషన్ చేయాలని వైద్యులు సూచించారన్నారు. కొటేషన్ లేనిదే సీఎం సహాయ నిధి ద్వారా గాని, మరి ఇతర మార్గం ద్వారా సాయాన్ని పొందలేని పరిస్థితి ఏర్పడిందన్నారు. సిఎంసి వేలూరు హాస్పిటల్ లో రెండు లక్షల రూపాయలు నగదు చెల్లించి అడ్మిట్ చేస్తే కొటేషన్ వేయిస్తామని చెప్పడంతో ఆర్థిక సహాయం కోసం ఎదురుచూస్తున్నామన్నారు. మానవతా దృక్పథంతో దాతలు సహాయం చేయాలని వేడుకున్నారు. దాతలు 8247773465 నంబరును సంప్రదించాలన్నారు.

రాష్ట్ర మహాసభలకు ఆహ్వాన కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: శుక్రవారం తిరుపతి, వేమన విజ్ఞాన కేంద్రంలో జరిగిన సమావేశంలో ఏపీ ఆర్టీసీ పిటిడి స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు ఎస్ కే జిలాని భాష మాట్లాడుతూ అక్టోబర్ 23 ,24 వ తేదీలో జరుగు రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని కోరారు. సమస్యల పరిష్కారం కోసం కార్మికులందరూ ఉద్యమించాల్సిన అవసరం ఉందన్నారు. జూలై 9వ తేదీన జరుగు దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని కోరారు. ఆర్టీసీ సమస్యలు పరిష్కరించాలని డిఏలు పిఆర్సి ఇవ్వాలని డ్యూటీ చార్టులు సీనియార్టీతో వేయాలన్నారు. అనంతరం స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ జిల్లా గౌరవాధ్యక్షులు మల్లికార్జున అధ్యక్షతన ఆహ్వాన కమిటీ ఎన్నిక సమావేశం జరిగింది.

రైతుల పట్ల వైసీపీది కపట ప్రేమ: నరసింహా యాదవ్

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): మామిడి రైతుల పట్ల వైసీపీ నాయకులకు ఉన్నది కపట ప్రేమ అని, శాంతిభద్రతల సమస్య ఉత్పన్నం చేయాలని జగన్ పర్యటన చేస్తున్నారని ఏపీ యాదవ సంక్షేమం, అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ గొల్ల నరసింహ యాదవ్ ఆరోపించారు. శుక్రవారం తిరుపతి ప్రెస్ క్లబ్ లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వీలైతే ప్రభుత్వానికి సలహాలు ఇవ్వాలని, అబద్ధపు ప్రచారాలు మానుకోవాలని హితవు పలికారు. ఈ విలేకరుల సమావేశంలో రామారావు, జగన్నాథం, జ్యోతి, అశోక్ కుమార్, జ్ఞాన శేఖర్ పాల్గొన్నారు.

స్వర్ణాంధ్ర విజన్ - 2047 తో
నియోజకవర్గ సమగ్రాభివృద్ధి

ప్రజాశక్తి - సత్యవేడు : స్వర్ణాంధ్ర విజన్ – 2047తో సత్యవేడు నియోజకవర్గం సమగ్రాభివృద్ధి చెందేలా అధికారులు విజన్ – ప్లాన్ తయారు చేయాలని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం సూచించారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో విజన్ ప్రోగ్రామ్ కన్వీనర్, ఎంపీడీవో త్రివిక్రమరావు ఆధ్వర్యంలో నియోజకవర్గస్థాయి ముందుచూపు (విజన్) కార్యాచరణ 2047 ప్రణాళిక తయారీపై ఏడు మండలాల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో డ్వామా పీడీ శ్రీనివాస ప్రసాద్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలో దుస్థితిలో ఉన్న రోడ్లు, వంతెనలు, ప్రభుత్వ కార్యాలయాల భవనాలు, పాఠశాలల్లో మెరుగైన వసతుల కల్పన, సాగునీటి ప్రాజెక్టులు ఆధునికీకరణ, త్రాగునీటి పనులు, ఆసుపత్రుల్లో మెరుగైన వసతులు ఏర్పాటు, స్మశానాల మరమ్మత్తులు వంటి పనులతో పాటు ప్రజలకు అవసరమైన అన్నీ పనులను తప్పక పొందుపరచాలని అధికారులకు దిశా నిర్దేశం చేశారు. అనంతరం నియోజకవర్గంలోని ఏడు మండలాల్లో12756 బంగారు కుటుంబాలను గుర్తించినట్లు తెలిపారు. ప్రభుత్వ అధికారులు, ప్రజాప్రతినిధులు, వ్యాపారులు వారి ఆర్థిక స్థాయిని బట్టి ఒకటి లేక రెండు బంగారు కుటుంబాలను అడాప్ట్ చేసుకోవాలని, నియోజకవర్గ సమగ్రాభివృద్ధికి తోడ్పడాలని సూచించారు. ఈ సమావేశంలో నియోజకవర్గంలోని ఎంపీడీవోలు బాలాజీ నాయక్, మహమ్మద్ రఫీ, మాలతి, వెంకటరత్నమ్మ, ప్రసాద్, హౌసింగ్ డిఈ శేషగిరి, పిచ్చాటూరు తహసిల్దార్ టీవీ సుబ్రహ్మణ్యం, స్థానిక రెవిన్యూ డిటి త్యాగరాజు, మండల పరిషత్ ఏఈ ఇబ్రహీం ఖాన్, ఆర్డబ్ల్యూఎస్ డీఈ శైలజ, ఎంఈఓ రవి, వెలుగు ఏపీఎం డాక్టర్ డాంగే యాదవ్, ఉపాధి ఏపీవో విజయ భాస్కర్ ఏడు మండలాలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

సీఎంకు చెడ్డపేరు తేవాలనే వైసిపి కుట్ర



పూతలపట్టు ఎమ్మెల్యే కలికిరి మురళీమోహన్

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): ఉమ్మడి చిత్తూరు జిల్లాలో మామిడి రైతులకు ఏ ప్రభుత్వమైనా మేలు చేసి ఉంది అంటే అది కూటమి ప్రభుత్వమే అని, మామిడి రైతులను ఆదుకుంటున్న ముఖ్యమంత్రి చంద్రబాబుపై లేనిపోని ఆరోపణలు చేస్తూ చెడ్డ పేరు తీసుకురావాలని వైసీపీ కుట్ర పన్నుతోందని, అందులో భాగంగానే జగన్ పర్యటన చేస్తున్నారని పూతలపట్టు నియోజకవర్గ శాసనసభ్యులు కలికిరి మురళీమోహన్ పేర్కొన్నారు. శుక్రవారం తిరుపతి ప్రెస్ క్లబ్లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజలు వైసిపిని మరిచిపోతారన్న భావనతో మామిడి రైతుల సమస్యను రాజకీయం చేస్తున్నారని ఆరోపించారు. జగన్ తన వైసీపీ నాయకులకు చెందిన గుజ్జు ఫ్యాక్టరీలకు వెళ్లి ప్రభుత్వం ఆదేశించిన ఎనిమిది రూపాయలు ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించగలరా అని నిలదీశారు. మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అనుచరుడు మామిడికాయలను రోడ్డుపై పోసి సామాజిక మాధ్యమాల్లో పెట్టారని, ఆ రాత్రి రోడ్డుపై పోసిన మామిడికాయలను తీసుకొని పక్క రాష్ట్రంలో అమ్మేసారని, దీనిపై ఆధారాలతో కేసు నమోదు చేయడం జరిగిందన్నారు. పోలీసు అధికారులు తనకు అనుమతి ఇవ్వాలని, జగన్‌తో పాటు నేరుగా రైతులతో తాను కూడా ఉండి జగన్‌ను కొన్ని ప్రశ్నలు అడుగుతానన్నారు.

పేదరిక నిర్మూలనే పి4 లక్ష్యం

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: పి4 విధానంతో 2029నాటికి తిరుపతి నియోజకవర్గంలో పేదరిక నిర్మూలన చేయడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు పేర్కొన్నారు. 20 శాతం పేదలను 10 శాతం సంపన్నులు ఆదుకోవడానికి ముఖ్యమంత్రి తీసుకొచ్చిన గొప్ప విధానం పి4 అని తెలిపారు. పి4 పై సీఎం శుక్రవారం సాయంత్రం వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు. మున్సిపల్ కార్పొరేషన్ సమావేశ మందిరంలో సిఎం వీడియో కాన్ఫరెన్స్‌కు ఎమెల్యే ఆరణి శ్రీనివాసులు, కమిషనర్ మౌర్యతో పాటు బంగారు కుటుంబ సభ్యులు, మార్గదర్శకులు హాజరైయ్యారు. ఆగస్టు 15వ తేది నాటికి రాష్ట్రంలోని 15లక్షల బంగారు కుటంబాలను మార్గదర్శకులు హ్యాండిల్ చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. తిరుపతిలో 6,379 మంది బంగారు కుటుంబాలను గుర్తించినట్లు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు తెలిపారు. వీరిని ఆదుకునేందుకు సుమారు ఏడు వందల మంది మార్గదర్శకులు అవసరమని ఆయన అభిప్రాయపడ్డారు. కమిషనర్ మౌర్య మాట్లాడుతూ మార్గదర్శకుల ఎంపికకు వార్డు కమిటీలు వేసి పదిహేను రోజుల్లో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కమిషనర్ చరణ్ తేజ్ రెడ్డి, ఉప కమిషనర్ అమరయ్య, రెవెన్యూ అధికారులు సేతు మాధవ్, రవి, డీసీపీ ఖాన్, మార్గదర్శకులు, బంగారు కుటుంబం సభ్యులు,, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రాభివృద్ధికే చంద్రబాబు కృషి

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): ఏడాది పాలనపై ప్రజలలో కూటమి ప్రభుత్వంపై ఉన్న అభిప్రాయాన్ని తెలుసుకోవడానికి సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం ఎంతగానో ఉపయోగపడుతోందని, రాష్ట్రాన్ని సమగ్రాభివృద్ధి దిశగా నడిపించడానికి సీఎం చంద్రబాబు నాయుడు ప్రయత్నం చేస్తున్నారని చిత్తూరు పార్లమెంటు సభ్యులు దగ్గుమళ్ళ వరప్రసాదరావు, చంద్రగిరి నియోజకవర్గ ఎమ్మెల్యే పులివర్తి నాని అన్నారు. శుక్రవారం మంగళం పరిధిలోని తిరుమల నగర్ గ్రామపంచాయతీ శేషాచల నగర్ లో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా మూడవరోజు ఇక్కడి స్థానికుల ఇళ్లకు వెళ్లి కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో చేసిన అభివృద్ధి కార్యక్రమాలను, ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో తిరుపతి రూరల్ మండల టిడిపి అధ్యక్షులు ఈశ్వర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి గోపీనాథ్, మహిళా అధ్యక్షురాలు, టిడిపి గ్రామ కమిటీ అధ్యక్షులు గోవిందరాజులు, కార్యదర్శి చెన్నరాయప్ప, ఈశ్వరయ్య, సురేష్ నాయుడు, భాస్కర్ రెడ్డి, రామకృష్ణ, చలపతి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు వెంటనే పరిష్కరించండి

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: పట్టణ ప్రణాళికా విభాగం నిర్వహించే ఓపెన్ ఫోరమ్‌లో ప్రజల నుండి వచ్చిన సమస్యలను వెంటనే పరిష్కరించాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య అధికారులకు సూచించారు. శుక్రవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో పట్టణ ప్రణాళిక ఆధ్వర్యంలో ఓపెన్ ఫోరం కార్యక్రమం నిర్వహించారు. ఖాదీ కాలని మాస్టర్ ప్లాన్ రోడ్డులో ఇండ్లు కోల్పోయిన బాధితులు కమిషనర్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. కమిషనర్ మాట్లాడుతూ అనుమతులు లేని నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలన్నారు. విచ్చలవిడిగా బ్యానర్లు ఏర్పాటు చేయకుండా తగు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో డిసిపి ఖాన్, ఏసిపి లు బాలాజి,మూర్తి, టిపిబిఓ లు మధుసూదన్, వంశీ, అన్ని సచివాలయాల కార్యదర్శులు పాల్గొన్నారు.

ఫుడ్ ప్రాసెసింగ్ పై శిక్షణ



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): ప్రకృతి వ్యవసాయ పద్ధతులలో పండించే పంటలకు గిట్టుబాటు ఉందని, గ్రామీణాభివృద్ధిలో రాష్ట్ర అభివృద్ధిపై ఫుడ్ ఒక్కరోజు ఫుడ్ ప్రాసెసింగ్ శిక్షణ కార్యక్రమాన్ని తిరుపతి జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ ప్రారంభించారు. శుక్రవారం డిఆర్డిఏ సమావేశ మందిరంలో ఆంధ్రప్రదేశ్ ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ, రైతు సాధికార సంస్థ, వారాహి ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈ వర్క్ షాప్‌ను ప్రారంభించారు. ప్రధానంగా నాచురల్ ఫామింగ్ అగ్రిగేటర్స్‌కు ఎలాంటి ప్రాసెసింగ్ యంత్రాలు కావాలి, ఏ యంత్రంకు ఎంత సబ్సిడీ వస్తుంది, బ్యాంకు లోన్లు అన్నదానిపై రైతులకు వివరించారు. చిరుధాన్యాలకు, నవధాన్యాలకు, వాటి పొడులకు మార్కెట్లో మంచి డిమాండ్ ఉందని, ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులను ప్రాసెసింగ్ చేసి అమ్ముకోవడం వలన ఎక్కువ ఆదాయం అర్జించవచ్చు అని ఫుడ్ ప్రాసెసింగ్ సెక్రటరీ చిరంజీవి చౌదరి తెలిపారు. ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులను ప్రభుత్వ కార్యాలయాలలో, రైతు బజార్లలో అమ్మకాలు చేసుకోవడానికి ప్రత్యేకమైన స్టాల్స్ ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఈ ఒక్కరోజు శిక్షణ కార్యక్రమంలో డిఆర్డిఏ పిడి శోభన్ బాబు, ఈడి సతీష్, రైతు సాధికార సంస్థ ప్రభాకర్, జిల్లా ఉద్యాన శాఖ అధికారి దశరథరామిరెడ్డి, డిపిఎం షణ్ముగం, వారాహి ఫౌండేషన్ డైరెక్టర్ హరికుమార్ రెడ్డి, ఎల్డిఎం రవికుమార్, కుమారస్వామి, గంగాధర్, పట్టాభి రెడ్డి, భాను, రైతులు పాల్గొన్నారు.

రైతే.. దేశానికి వెన్నెముక : చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు



ప్రజాశక్తి - రేణిగుంట: భారతీయ వ్యవసాయ పరిశోధన మండలి, భారతీయ ఉద్యాన పరిశోధన సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం రేణిగుంట మండలం, కరకంబాడి పంచాయతీ, వనస్థలి సమీపంలోని రాస్– కృషి విజ్ఞాన కేంద్రంలో ఖరీఫ్ పంటలకు సంబంధించి రైతులకు శిక్షణ, ఇన్ పుట్స్ పంపిణీ, షెడ్యూల్డ్ కులాల ఉప ప్రణాళిక అనే అంశాలపై నిర్వహించిన అవగాహన సదస్సుకు చిత్తూరు పార్లమెంటు సభ్యులు దగ్గుమళ్ళ ప్రసాదరావు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ దేశానికి వెన్నెముక ఆయిన రైతును కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. రాస్ –కృషి విజ్ఞాన కేంద్రం సేవలను కొనియాడారు.

ఘనంగా వంగవీటి జయంతి

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : విజయవాడ మాజీ ఎమ్మెల్యే దివంగత నేత వంగవీటి మోహన్ రంగా జయంతి వేడుకలు శుక్రవారం పుత్తూరు, బలిజ భవనంలో నిర్వహించారు. శ్రీకృష్ణదేవరాయలు బలిజ అభ్యుదయ సేవా సమితి అధ్యక్షుడు పసుపులేటి శివయ్య, బలిజ సంఘం నాయకులు రంగాకు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జాతీయ కాపు సంఘం ప్రచార కార్యదర్శి, పుత్తూరు బలిజి సంఘం సభ్యుడు గోపి రాయల్, సంఘ నాయకులు కృష్ణయ్య, గోపాల్, కొట్టే రాజేంద్ర, మునిరత్నం తదితరులు పాల్గొన్నారు.

శంకర్ రెడ్డికి ఘన సన్మానం



ప్రజాశక్తి - సత్యవేడు: సత్యవేడు నియోజకవర్గ టిడిపి ప్రోగ్రాం సమన్వయకర్తగా నియమితులైన కూరపాటి శంకర్ రెడ్డిని పలువురు టిడిపి నేతలు ఘనంగా సన్మానించారు. శుక్రవారం తిరుపతిలో శంకర్ రెడ్డి స్వగృహంలో సత్యవేడు టిడిపి నేతలు మురళి(చికెన్ చిన్న), ఎంపిటిసి బాలసుందరం రెడ్డి, మండల రేషన్ డీలర్స్ సంఘం అధ్యక్షులు సునీల్ జైన్, శంకరయ్య, నారాయణ, గుణ, మల్లి, సుధాకర్ తదితరులు శంకర్ రెడ్డిని ఘనంగా సత్కరించారు.

క్రైం న్యూస్

గుర్తుతెలియని వ్యక్తి మృతి



ప్రజాశక్తి - తిరుపతి సిటీ: తిరుపతి రూరల్, పుదిపట్ల స్మశాన వాటికలో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెంది ఉండడాన్ని స్థానికులు గమనించి, వీఆర్వో ఈశ్వరయ్య ద్వారా తిరుపతి రూరల్ పోలీసులకు సమాచారం అందించారు. సీఐ చిన్న గోవిందు ఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. ప్లాస్టిక్ బాటిల్స్ సేకరించి అమ్ముకునే గుర్తు తెలియని వ్యక్తిగా పోలీసులు ప్రాథమిక అంచనాకు వచ్చారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని రుయా మార్చురీకి తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసే దర్యాప్తు చేస్తున్నారు. మృతుడి వద్ద లభించిన ఆధారాలను బట్టి, ఎవరైనా మృతుడిని గుర్తిస్తే, తిరుపతి రూరల్ పోలీస్ సంప్రదించాలని సీఐ కోరారు.

అంతర్రాష్ట్ర మాయగాళ్లు అరెస్టు



ప్రజాశక్తి-శ్రీకాళహస్తి : ఒంటరి మహిళలే లక్ష్యంగా పాత నగలు కొంటామని డబ్బు ఆశ చూపి..మాయ మాటలతో మోసాలు చేసే ముగ్గురు అంతర్రాష్ట్ర మాయగాళ్లను టూ టౌన్ పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి సుమారు రూ.11 లక్షల విలువచేసే 114 గ్రాముల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. ఆ వివరాలను స్థానిక టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో సిఐ నాగార్జున రెడ్డి మీడియాకు వివరించారు. గత నెల 23వ తేదీన సునీత అనే ఓ మహిళా ఉద్యోగి తన వద్ద ముగ్గురు యువకులు పాత బంగారం కొంటామని నకిలీ నోట్లచ్చి మోసం చేశారంటూ పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసును సీఐ నాగార్జున రెడ్డి అనతికాలంలోనే ఛేధించారు. స్థానిక ఆర్టీసీ బస్టాండ్ కూడలి వద్ద అనుమానాస్పదంగా తిరుగుతున్న ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకొని విచారించారు. తీగ లాగితే డొంకంతా కదిలినట్లు మాటలతో గారడి చేసి, మహిళల దగ్గర బంగారం తస్కరిస్తున్నట్లు ఒప్పుకున్నారు. లోతుగా విచారించగా చిత్తూరు, కడప తెలంగాణ ప్రాంతాల్లో వీరిపై కేసులు ఉన్నాయనీ, శిక్ష కూడా అనుభవించినట్లు సీఐ తెలిపారు. వీరి వద్ద నుంచి రూ.11 లక్షల విలువచేసే 114 గ్రాముల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. పట్టుపడ్డ వారిలో ఇద్దరు యువకులు కాగా, ఒకరు మైనర్ బాలుడు. గుజరాతి కిషన్(24)ది గుజరాత్ కాగా, శ్యాంలాల్(30)ది న్యూఢిల్లీ. వీరంతా తెలంగాణలోని మల్కాజ్గిరిలో ఉంటూ మోసాలకు పాల్పడుతున్నారు. ఈ కేసు దర్యాప్తులో ప్రతిభ కనబర్చిన కానిస్టేబుళ్లు అరుణ్ కుమార్, బాబు, నందకుమార్, సుధాకర్, క్రాంతి కుమార్, సుబ్రహ్మణ్యం, నరేష్, రెగన్ లను సిఐ అభినందించారు.

పాముకాటుకు గురైన వ్యక్తి మృతి



నివాళి అర్పిస్తున్న బొజ్జల రిషితా రెడ్డి, ఇన్ సెట్‌లో వెంకట్రాయులు

ప్రజాశక్తి -ఏర్పేడు :మండలంలోని గుండ్లకండ్రిగకు చెందిన వెంకట్రాయులు (56) ఇటీవల పాముకాటుకు గురయ్యాడు. వారం రోజులుగా తిరుపతి రుయా హాస్పిటల్లో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందారు. శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి సతీమణి రిషితా రెడ్డి మృతదేహం వద్ద నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రభుత్వ సాయం అందేలా చూస్తామని తెలిపారు.

ఎర్రచందనం స్మగ్లర్‌కు ఐదేళ్లు జైలు

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): శేషాచలం అడవుల నుండి ఎర్రచందనం అక్రమ రవాణా చేస్తూ పట్టుబడిన ముద్దాయికి ఐదేళ్ల జైలు శిక్ష, ఆరు లక్షల రూపాయల జరిమానా విధిస్తూ ఆర్ఎస్ఎస్ ఏడిజె కోర్టు జడ్జి నరసింహమూర్తి శుక్రవారం తీర్పునిచ్చారు. ఆధారాలను కోర్టుకు పక్కాగా సమర్పించడంతో స్మగ్లర్లకు శిక్షలు పడుతున్నాయని టాస్క్ ఫోర్స్ అధికారులు తెలిపారు. 2019లో శేషాచలం అటవీ పరిధి నాగపట్ల బీట్ చామల రేంజిలో తమిళనాడుకు చెందిన వెల్లియన్ ఎర్రచందనం అక్రమ రవాణా చేస్తూ దొరికిపోయాడన్నారు. నెల్లూరు సెంట్రల్ జైలుకు సదరు ముద్దాయిని తరలించడం జరిగిందని టాస్క్ ఫోర్స్ అధికారులు తెలిపారు.

సీతమ్మ భూముల్లో రోశయ్య విగ్రహం ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): తిరుపతి నగర పరిధిలోని సీతమ్మ భూముల్లో మాజీ ఉమ్మడి రాష్ట్ర ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య స్మారక విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని ఉమ్మడి చిత్తూరు జిల్లా ఆర్యవైశ్య సంఘం నిర్ణయించిందని ఆర్యవైశ్య మహాసభ సీనియర్ నాయకులు ముమ్వల నరసింహులు శెట్టి తెలిపారు. శుక్రవారం తిరుపతి ప్రెస్ క్లబ్లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రోశయ్య విగ్రహాన్ని ఏర్పాటు చేయడానికి అందరి సహాయ సహకారాలను తీసుకుంటామన్నారు.

IN THE COURT OF THE PRINCIPAL CIVIL JUDGE
(Senior Division) :: Tirupati
S.O.P. No. 1 of 2025

B. Kavya & another **...Petitioners**
Vs.
T.T.Devasthanams, rep. by its Executive Officer, Tirupati
... Respondent

GENERAL NOTICE

The Petitioners filed petition in the above petition for grant of succession certificate to get the death and retirement benefits from the T.T.D. authorities. If any objections are there raise the objection either in person or through the Advocate on or befor 28.07.2025.

D. SRIKANTH,
G.V. RAMANAIAH
Advocates, Tirupati

(Sumons Under order 5 rule 1 c.p.c)
IN THE COURT OF THE PRL JUNIOR CIVIL JUDGE, GUDUR
O.S NO 86 / 2023

Pavuluru. Koteswarao Naidu. ....Plaintiff
V.S
1. Chunduru.Vijayamma and 3 Others ....Defendants

Summons to D3 & D4

D3. Chunduru Arun Kumar, Son of late Raghuramaiah, C/o Syam Provisions, Besides Indian Tea centre Mythyalapeta, Gudur town, Tirupathi Dt.
D4. Vankayalapati.Supraja,D/o late Raghuramaiah, C/o Syam Provisons, Besides Indian Tea centre, Muthyalapeta, Gudur town, Tirupathi Dt.

Whereas the plaintiff filed the suit against you for recovery of amount basing on the promissory note dt 7-2-2020 executed by husband of No 1 and father of defendants No 2 to 4 in the suit for Rs 3,85,000/- as his assets are succeeded to all of you and you are jointly enjoying the same, therefore you are held liable to pay the suit amount to the plaintiff out of the estate of the deceased Chunduru.Raghuramaiah. As such No 3 and 4 you are hereby summoned to appear before this court on 21-7-2025 at 10-30 a.m either personally or through pleader and give answer any on behalf of you. If you are failed to attend before this Hon'ble court on the date specified above and the matter will be determined in your absence.

S. Gangi Reddy, M.A,B.L,
Advocate for the plaintiff,
Cell No :9440658156

ఎమ్మార్వోను కలిసిన ప్రగతి సంస్థ సిబ్బంది



ప్రజాశక్తి - తొట్టంబేడు : మండల కేంద్రంలోని స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో శుక్రవారం ప్రగతి సంస్థ సిబ్బంది మండల తహశీల్దార్ భారతిని మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. ప్రగతి సంస్థ చేస్తున్న సేవలను ఆమెకు వివరించారు. తహశీల్దార్ మాట్లాడుతూ సమాజం కోసం మంచి కార్యక్రమాలు చేసే వారికి సహకారం అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో చందమామల కోటయ్య, యానాది సంఘం కార్యకర్తలు పాల్గొన్నారు.

పనిచేసే ప్రభుత్వాన్ని ఆశీర్వదించండి



ప్రజాశక్తి - చిన్నగొట్టిగల్లు: ప్రజల కోసం పనిచేసే కూటమి ప్రభుత్వాన్ని ఆదరించాలని టీడీపీ చిన్నగొట్టిగల్లు క్లస్టర్ ఇంచార్జ్ కొట్టేసి కుమార్ కోరారు. చిన్నగొట్టిగల్లులో శుక్రవారం ఏడాది కూటమి పాలనలో చేసిన సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తెలియజేసిన పార్టీ నాయకులు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధికే సభలు



ప్రజాశక్తి - ఏర్పేడు: మండలంలోని యండి పుత్తూరులో సర్పంచ్ మోహనప్రియ ఆధ్వర్యంలో శుక్రవారం గ్రామసభ నిర్వహించారు. ఈ సభలో పశువైద్యాధికారిగా బాధ్యతలు చేపట్టిన డాక్టర్ శిల్పారెడ్డి, పంచాయతీ కార్యదర్శి ఝాన్సిరాణిలను సత్కరించారు. ఈ సభలో గ్రామంలో సేకరించిన చెత్త వేయుటకు స్థలం కేటాయించాలని కోరగా, రెవిన్యూ అధికారులతో సంప్రదించి స్థలం ఏర్పాటు చేస్తామని సర్పంచ్ తెలిపారు. పాఠశాలల విలీనం గురించి, గ్రామంలో పలు అభివృద్ధి కార్యక్రమాల గురించి చర్చించారు.

విద్యార్థులకు నాణ్యమైన విద్య



ప్రజాశక్తి - రామచంద్రాపురం: రాష్ట్రంలో పేద విద్యార్థుల విద్యాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం నూతన విద్యా విధానాన్ని అమలుచేసి, ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు నాణ్యమైన విద్య అందిస్తోందని మండల టీడీపీ నాయకులు మేకల తిరుమలరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని దేశూరు కండ్రిగలో సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి తిరిగి ప్రభుత్వ పథకాలను వివరించారు. ఈ కార్యక్రమంలో రావిళ్ల గిరి, కోరా హరి ప్రసాద్, ఆర్ నీలకంఠ చౌదరి, సాయి ప్రసాద్ రెడ్డి, రవి, మధుసూదన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ సదస్సు బ్రోచర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - క్యాంపస్ : యస్వీయులో నవంబరు 17-19 తేదీల్లో యుజిసి ఇన్ ఫ్లిబ్ నెట్ నిర్వహించే అంతర్జాతీయ సదస్సు బ్రోచర్‌ను విశ్వవిద్యాలయం ఇంచార్జీ ఉపకులపతి ఆచార్య అప్పారావు, రిజిస్ట్రార్ ఆచార్య భూపతి నాయుడు, సదస్సు సంచాలకులు ఆచార్య సురేంద్ర బాబు, యుజిసి సైంటిస్టులు శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సదస్సు గురించి ఆచార్య సురేంద్ర బాబు మాట్లాడుతూ యస్వీయూనివర్సిటీలో జరిగే ఈ అంతర్జాతీయ సదస్సుకు 7 దేశాల నుండి దాదాపు 500 మంది ప్రతినిధులు పాల్గొంటారన్నారు. ఈ కార్యక్రమంలో ఆచార్య సుధారాణి, ఆచార్య చంద్రాయుడు, సైంటిస్టులు డా.వల్లభ్ ప్రధాన్, శేఖర్,రాజన్ తదితరులు పాల్గొన్నారు.

9 న సార్వత్రిక సమ్మెను జయప్రదం చేద్దాం



ప్రజాశక్తి - గూడూరు టౌన్ : ఈనెల 9వ తేదీన జరిగే సార్వత్రిక సమ్మె జయప్రదం చేద్దామని ఏఐటియుసి జిల్లా అధ్యక్షులు చంద్రశేఖర్ రెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రభాకర్‌లు పిలుపునిచ్చారు. శుక్రవారం గూడూరు పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో ఏఐటీయూసీ గూడూరు నియోజక వర్గ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై పోరాటానికి సిద్ధమవ్వాలని సూచించారు. లేబర్ కోడ్‌తో కార్మికులు ఎదుర్కోనున్న సమస్యలను చర్చించారు. 9వ తేదీన సమ్మె జయప్రదం చేయాలని 6 వ తేదీ బైక్ ర్యాలీలు చేపట్టాలని తీర్మానించారు. 20న గూడూరులో ఏఐటియుసి నియోజకవర్గ సమితి సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఐటియుసి జిల్లా సమితి సభ్యులు ఎంఆర్ పల్లి శ్రీనివాసులు, ఏఐటియుసి నియోజక వర్గ కార్యదర్శి నారాయణ, ఆంధ్ర ప్రదేశ్ రైతు సంఘం జిల్లా నాయకులు సివిఆర్ కుమార్, చిల్లకూరు సీపీఐ మండల కార్యదర్శి రమేష్, సునీల్, భాస్కర్, వెంకటయ్య, రాఘవయ్య, నరసింహులు శెట్టి, చెంచయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆయుర్వేద విజ్ఞానంపై అవగాహన ఒప్పందం



ప్రజాశక్తి - క్యాంపస్ : తిరుపతి, శ్రీ వేంకటేశ్వర వేద విశ్వవిద్యాలయం, నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియన్ మెడికల్ హెరిటేజ్‌ల మధ్య ప్రాముఖ్యమైన అవగాహన ఒప్పందం కుదిరింది. ఈ విషయమై విశ్వవిద్యాలయ కులపతులు ప్రొఫెసర్ రాణి సదాశివ మూర్తి, రిజిస్ట్రార్ డాక్టర్ పొకల భాస్కరుడు, జాయింట్ డైరెక్టర్ డాక్టర్ గోలీ పెంచల ప్రసాద్‌లు శుక్రవారం అధికారికంగా ఒప్పందంపై సంతకాలు చేశారు. వేద జ్ఞానాన్ని ఆయుర్వేద, వారసత్వ పరిశోధనలతో సమన్వయం చేయుట, ముఖ్యంగా వృక్షాలు, లోహాలు, ఖనిజాలు, జంతు ఉత్పత్తులు, ఇతర పూజా సామగ్రి వంటి స్థానిక సంప్రదాయాలను డాక్యుమెంట్ చేయుట, వాటిని వైదిక గ్రంథాల్లో ఉన్న మూలాలను శోధించి వాటిలోని శాస్త్రీయతను నిరూపణ చేయుట వంటి అంశాలపై కలిసి పనిచేయనున్నట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమాల అమలుకయ్యే ఖర్చులు కేంద్ర ప్రభుత్వ ఆయుష్ మంత్రిత్వ శాఖ అందించనుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో పరిశోధన డైరెక్టర్ డాక్టర్ రాధేశ్యామ్, సహాచార్యులు డా. రామకృష్ణ పాల్గొన్నారు.

వైభవంగా ముగిసిన శ్రీ వారాహి దేవి నవరాత్రి ఉత్సవాలు

శ్రీ వారాహి దేవికి పట్టు వస్త్రాలు సమర్పించిన తుడా చైర్మన్ దివాకర్ రెడ్డి



ప్రజాశక్తి - రామచంద్రపురం : మండలంలోని రాయల చెరువు కట్ట సమీపంలో వెలసియున్న శ్రీ శక్తి పీఠం నందు శ్రీ వారాహీ దేవి నవరాత్రుల ఉత్సవాలు వైభవంగా ముగిసాయి. శుక్రవారం శ్రీ వారాహీ దేవి నవరాత్రి ఉత్సవాలు చివరి రోజున కుర్తాళం పీఠాధిపతి శ్రీ సిద్ధేశ్వరానందభారతి మహాస్వామి, శ్రీ శక్తి పీఠాధీశ్వరి మాతాజీ శ్రీ రమ్యానందభారతీ స్వామిలు ఆధ్వర్యంలో ఉదయం 10 గంటలకు శ్రీ వారాహి అమ్మవారికి పంచామృత అభిషేకం నిర్వహించి, పట్టు వస్త్రాలు, బంగారు ఆభరణాలు, వివిధ పుష్పాలతో విశేషంగా అలంకరించారు. మంగళ వాయిద్యాలు, వేదమంత్రాలు, ఓం శక్తి నామ స్మరణల నడుమ ప్రత్యేక పూజలు హోమాలు నిర్వహించారు. అనంతరం శ్రీ కిరాత వారాహీ దేవికి దర్బారు సేవ నిర్వహించారు. తుడా చైర్మన్ సి దివాకర్ రెడ్డి, మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ డాక్టర్ శిరీషాలు ముఖ్య అతిథులుగా హాజరై అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. అనంతరం శ్రీ శక్తి పీఠం నిర్వాహకులు వారికి ప్రత్యేక దర్శన ఏర్పాటు చేశారు. శ్రీ శక్తి పీఠం పీఠాధీశ్వరి మాతాజీ శ్రీ శ్రీ శ్రీ రమ్యానందభారతీ స్వామిలు దివాకర్ రెడ్డి, డాక్టర్ శిరీషలను ఆశీర్వదించి అమ్మవారి తీర్థ ప్రసాదాలను అందజేశారు. చివరి రోజు కావడంతో శ్రీ శక్తి పీఠం భక్తులతో కటకటలాడింది. శ్రీ శక్తి పీఠం నిర్వాహకులు భక్తులందరికీ అమ్మవారి తీర్థప్రసాదాలు, పసుపు, కుంకుమ, బొందారాలు పంపిణీ చేశారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎం తిరుమలరెడ్డి, మాధవి రెడ్డి, శేఖర్ నాయుడు, మాదాసు మాధవయ్య, కార్యనిర్వాహకులు శ్రీకాంత్, ప్రసాద్, సుధారాణి భక్తులు పాల్గొన్నారు.

జగదీష్ అందరివాడు: స్టార్ కృష్ణ



ప్రజాశక్తి -ఏర్పేడు : ఇటీవల తిరుపతి జిల్లా పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్ అధికారిగా పదవీ బాధ్యతలు చేపట్టిన జగదీష్‌ని ఆంధ్రప్రదేశ్ షెడ్యూల్డ్ కులాల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు, ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్ బహుజన ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు అంబేద్కర్ స్టార్ కృష్ణ ఆర్.ఎమ్ జగదీష్‌ను "అందరివాడు" గా అభివర్ణించారు. శుక్రవారం మాజీ మంత్రివర్యులు పరసా రత్నం, మాజీ ఎం.ఎల్.సి శ్రీనివాస రెడ్డి, తిరుపతి అంబేద్కర్ భవన్ చైర్మన్ పరమశివన్‌లతో ఆర్.ఎం కార్యాలయంలో సత్కరించారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ బహుజన సంఘం నాయకులు గాలి రవి, వెంకటేష్, కాంగ్రెస్ మామ, జయంత్ బాబు, గురుమూర్తి, ప్రసాద్, అంబేద్కర్ భవన్ నుండి నాయకులు పుష్పరాజ్, ఇంద్రముని తదితరులు పాల్గొన్నారు.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రం తనిఖీ

ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ విజయవాడ, వైటల్ స్టాటిస్టిక్స్ డిప్యూటీ డైరెక్టర్ చంద్రశేఖర రావు, శ్రీకాళహస్తి డిప్యూటీ డిఎంహెచ్ఓ డాక్టర్ మృదుల వాణి, తిరుపతి జిల్లా స్టాటిస్టికల్ ఆఫీసర్ నాగేంద్ర కుమార్‌లు బుచ్చినాయుడు కండ్రిగ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శుక్రవారం తనిఖీ చేశారు. కేంద్రంలోని రికార్డులను పరిశీలించారు. పీహెచ్సీలో కాన్పులు కూడా పెంచాని సిబ్బందికి సూచించారు. ఓపికి వచ్చిన రోగులతో మాట్లాడి సిబ్బంది పనితీరు గురించి తెలుసుకున్నారు.

రేపు జూనోసిస్ డే



డాక్టర్ సురేష్

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : ఆదివారం జూనోసిస్ డే సందర్భంగా గూడూరు, ప్రాంతీయ పశువైద్యశాలలో పెంపుడు కుక్కలకు ర్యాబిస్ వ్యాధి రాకుండా ఉచిత టీకాలు వేస్తామని గూడూరు ప్రాంతీయ పశు వైద్యశాల సహాయ సంచాలకులు సురేష్ తెలిపారు. పాడి జీవాలనుండి, పెంపుడు జంతువుల నుండి మనుషులకు సోకే వ్యాధులపై అవగాహన కల్పిస్తామని తెలిపారు.

సుపరిపాలనలో తొలి అడుగు



ప్రజాశక్తి - తొట్టంబేడు: మండలంలోని పెద్ద కన్నలిలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నియోజకవర్గ టీడీపీ పరిశీలకులు అంకయ్య చౌదరి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వంలో ప్రజలు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నారన్నారు. రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో ముందుకు నడిపించడమే టీడీపీ లక్ష్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

మానవ మనుగడకు చెట్లు అవసరం



ప్రజాశక్తి - తొట్టంబేడు: మండలంలోని పెద్ద కన్నలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం సేవ్ ఆక్సిజన్ ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో 200 మొక్కలను నాటారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ సంస్థ వ్యవస్థాపకులు కేశవులు మాట్లాడుతూ ప్రతి జీవికి స్వచ్ఛమైన గాలి అవసరమన్నారు. మొక్కలు ఆ అవసరాన్ని తీరుస్తాయన్నారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు లత, దుర్గాప్రసాద్, సేవ్ ఆక్సిజన్ ఫౌండేషన్ కార్యకర్తలు లక్ష్మీ, గుర్రప్ప పాల్గొన్నారు.

జన్ సురక్ష ఇన్సూరెన్స్‌పై అవగాహన

ప్రజాశక్తి - వరదయ్యపాలెం: ఇందిరా నగర్ పంచాయతీ పరిధి, పద్మావతిపురం కమ్యూనిటీ భవనంలో ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు ఆధ్వర్యంలో జన్ సురక్ష ఇన్సూరెన్స్ పథకంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బ్యాంకు మేనేజర్ మీనా మాట్లాడుతూ, జన్ సురక్ష బీమా, అటల్ పెన్షన్ యోజన, ప్రధాన్ మంత్రి జీవన్ జ్యోతి బీమా, (పీఎంఎస్బివై, పీఎం జెబివై, పీఎం ఏపివై) వంటి పథకాలు సామాన్య ప్రజలకు ఆర్థిక రక్షణ కలిగించడమే లక్ష్యంగా ప్రభుత్వం తీసుకొచ్చినవని వివరించారు. గ్రామీణ ప్రజలు ఈ పథకాల సద్వినియోగం చేసుకుని భవిష్యత్తుకు ఆర్థిక భద్రత ఏర్పరచుకోవాలని సూచించారు. సున్నా బ్యాంకు ఖాతాల ద్వారా ఈ పథకాలకు సులభంగా నమోదు చేసుకోవచ్చని, ప్రతి ఒక్కరూ తమ కుటుంబ భవిష్యత్ కోసం ఈ బీమా పథకాలను తప్పనిసరిగా ఎంచుకోవాలని వివరించారు.ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.